క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



అర్చనను సన్మానిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మాటేటి అర్చన 10వ తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచినందుకు డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య సోమవారం ఘనంగా సన్మానించారు. అర్చన మేథా ట్రస్ట్ నిర్వహించిన పరీక్షల్లో సైతం ఎంపికైనందుకు అభినందిస్తూ భవిష్యత్‌లో బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. 10 ఫలితాల్లో 100 శాతం ఫలితాలు సాధించినందుకు ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డిని కూడా ఈ సందర్భంగా అభినందిస్తూ భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

చిలుకలయ్య గుడికి విరాళం

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామంలో పురాతన కాలంలో వెలసిన చిలుకలయ్య దేవుని గుడికి గ్రామస్తులు పనులు ప్రారంభించారు. ఈ గుడి నిర్మాణం కోసం కవ్వాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లాకవత్ సక్రునాయక్ సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు, దాతలు గుడి నిర్మాణానికి సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, శివ తెలిపారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక



జామ మసీద్ అడ్‌హక్ కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జామ మసీదులో సోమవారం ప్రతిరోజు నమాజ్ చదివే ముస్లింలందరూ కలిసి అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ అడ్‌హక్ కమిటీని మత పెద్దల సమక్షంలో ఎన్నుకోగా, నాలుగేళ్లుగా కమిటీ లేకపోవడంతో, మసీదు నిర్వహణ, పరిశుభ్రత, వసతుల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో, అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే వక్ఫ్ బోర్డు ద్వారా ఎన్నికలను నిర్వహించేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అడ్‌హక్ కమిటీలో నూరొద్దీన్, అజ్మతుల్ల ఖాన్, ఇద్రిస్ అహ్మద్, రియాజ్ హుస్సేన్, ఉస్మాన్, సలొద్దీన్ ఉన్నారు.

కారల్‌మార్క్స్ జయంతి



నివాళులర్పిస్తున్న వాకర్స్

కాసిపేట: సోమగూడం మైదానంలో కారల్‌మార్క్స్ జయంతిని సోమవారం వాకర్స్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంకె రవి, సిద్దయ్య, బానేష్, బోగే పోశం, అజ్మీర శ్రీనివాస్, ప్రభుదాస్, ఎస్.శ్రీనివాస్, కిరణ్ , రమేష్, అంజయ్య, వాకర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

కోటపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధిపై ప్రతీ మూడు నెలకొకసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం సోమవారం రోజున ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మయ్య తెలిపారు.

నియామకం



మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ వర్కర్స్ కమిటీ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జిగా రేగుంట ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షబ్బీర్ అలీ సోమవారం నియామక పత్రాన్ని అందించారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ప్రవీణ్ తెలిపారు.

ప్రసవాలకు సెలవు!

- జన్నారం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత
- మండలంలోని గిరిజనులకు తప్పని తిప్పలు
- డెలివరీల కోసం వస్తున్న వారికి నిరాశే..
- ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీరుపై విమర్శలు

☞ గత నెల 23న రోటిగూడ గ్రామానికి చెందిన శోభ అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతూ జన్నారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. సిబ్బంది లేరని వైద్యురాలు లక్సెట్టిపేట ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. 108సిబ్బంది మహిళకు పురుడు పోశారు.

☞ ఈ నెల 3న జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన శ్రీలత పురిటి నొప్పులు రావడంతో జన్నారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.మూడు గంటలు ఆసుపత్రిలోనే ఉంచుకొని, తీరా నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది లేరని, చూసుకునే వారు లేరనే సాకుతో వేరే ఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పారు. దీంతో దిక్కుతోచని స్థితిలో మహిళను లక్సెట్టిపేట ఆసుపత్రికి తీసుకెళ్లగా మగ బిడ్డకు జన్మనిచ్చింది.



జన్నారం: ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచాలని, శస్త్ర చికిత్స లేకుండా నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలని ప్రభుత్వం అనేక సందర్భాలలో చెబుతోంది. గత ప్రభుత్వం కేసీఆర్ కిట్టు, అమ్మఒడి వాహనం ద్వారా గర్భిణులను ఉచితంగా ఆసుపత్రులకు తీసుకెళ్లడం లాంటి పథకాలతో ప్రజల్లో అవగాహన కల్పించగా, ప్రజలు ఆసక్తి కనబరిచారు. కానీ ప్రస్తుతం జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు వైద్య సిబ్బంది ఆసక్తి కనబరచకపోవడం వల్ల, వేరే ఆసుపత్రులకు రెఫర్ చేయడం వల్ల ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలనే ఆసక్తి పోతోంది. కొన్ని నెలలుగా ప్రసవాలు చేసేందుకు ఆసుపత్రిలో సిబ్బంది ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

సిబ్బంది కొరత..

మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మండలంలో 29గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో అత్యధికంగా నిరుపేదలున్నారు. గిరిజన గ్రామాలున్నాయి. ఎక్కువ మంది నిరుపేదలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేక, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటారు. ఆరు నెలల క్రితం వరకు రోజుకు వందకు పైగా ఓపీ ఉండేది. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా వైద్యం అందని ద్రాక్షలా మారుతోంది. ఆసుపత్రికి ముగ్గురు స్టాఫ్ నర్సు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఇద్దరు వైద్యులు అవసరం ఉండగా, ప్రస్తుతం ఒక్కరే వైద్యులు పని చేస్తున్నారు. ఉన్న ఒక్క వైద్యురాలు సమావేశాలకు, ప్రభుత్వ కార్యకలాపాలకు వెళ్లడంతో ఆసుపత్రిలో వైద్యం చేసే వారు ఉండరు. దీంతో పేదలు, మధ్యతరగతి వారు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు.

స్టాఫ్ నర్సులు లేరు..

స్టాఫ్ నర్సుల కొరత కారణంగా ప్రసవం చేయడానికి అనాసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రసవం అనంతరం తల్లీ బిడ్డల క్షేమం చూసుకోవాల్సి ఉంటున్నందునా డెలివరీలు చేసేందుకు ముందుకు రావడం లేదు. జిల్లా అధికారులు స్పందించి ఆసుపత్రికి స్టాఫ్ నర్సులను నియమించి, ఆసుపత్రిలో వైద్యం అందేలా, ప్రసవాలు జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బంది అవసరం ఉంది..

ఆసుపత్రిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఎవ్వరూ లేరు. వైద్యురాలిని కూడా నేను ఒక్కరినే ఉన్నాను. ఇద్దరు వైద్యులు, ఒక్క స్టాఫ్ నర్సు ఉన్న రోజుల్లో ఇక్కడే ప్రసవాలు చేశాం. కొన్ని నెలలుగా సిబ్బంది కొరత కారణంగానే రెఫర్ చేస్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఉమా శ్రీ, వైద్యురాలు

తలసేమియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

బెల్లంపల్లి: తలసేమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ కోరారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిలక్‌స్టేడియంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి నివారణ కోసం పెళ్లికి ముందు హెచ్‌బీఏ2 రక్త పరీక్షలు చేయించుకొని వ్యాధిని నివారించవచ్చన్నారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు ప్రతి పక్షం రోజులకోసారి జీవితాంతం రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుందన్నారు. మెడికల్ నిబంధనలు తప్పక పాటించాలని వివరించారు. వ్యాధి పూర్తిగా నయం కావడానికి బోన్ మార్పిడి చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ బెల్లంపల్లి డివిజన్ సభ్యుడు గజెల్లి మోహన్, సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రత్నం రాజం, రంగ రామయ్య, రాజ్‌కుమార్, గెల్లి జయరాం, ముత్తే వెంకట్రాజం, కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎండలు మండుతున్నా ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులను ఇక్కట్లు గురిచేస్తుందని దృష్టికి తెచ్చారు. పాఠశాలలపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వేసవి సెలవుల్లో పాఠశాలల్లో ఎలాంటి శిక్షణ తరగతులు నిర్వహించరాదని డీఈవో యాదయ్య తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పాఠశాలలపై చర్యలు తప్పవన్నారు.

హాజీపూర్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం



ఈజీఎస్ కూలీల దగ్గర ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. స్థానికంగా ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటెయ్యాలని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, స్థానిక నాయకులు సోగాల కిష్టయ్య, సామల బుచ్చయ్య, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని 22వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు నడిపల్లి విజిత్‌రావు ఇంటింటికీ తిరుగుతూ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వంగ తిరుపతి, కుర్మిల్ల అన్నపూర్ణ, టీబీజీకేఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, రమేశ్, అన్వేష్‌రెడ్డి, తిప్పని రామయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 4, 5, 18 వార్డుల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, కౌన్సిలర్ హఫీజ్ బేగం, నాయకులు తాజుద్దీన్, గోగుల రవీందర్ రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్, కర్ర శంకర్, పడాల రవి, పడాల శ్రీనివాస్, ఖలీల్, పల్లపు రాజు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపోలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేలా ఆర్టీసీ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, విజిలెన్స్, సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారసంతలో స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మజ్జి గ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ఎండ వేడిమి నుంచి కాస్తా ఉపశమనం పొందేందుకు గ్రామానికి చెందిన ముత్యం శ్రీనివాస్ అందించిన మజ్జిగను భజన మండలి వా రు పంపిణీ చేశారు. కన్వీనర్ రావర్తి రాజన్న, సభ్యులు సాయిరాం, రాధకిషన్, కుమారస్వామి, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి



దేవాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ, ఎస్సైలు



జన్నారం: కవాతులో సీఐ, ఎస్సైలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలిసిందిగా సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజాస్వామ్యంలో కల్పించిన ఓటు హక్కును స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జన్నారంలో పోలీసుల కవాతు

జన్నారం: ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా, ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం కేంద్ర బలగాలతో కలిసి సీఐ కవాతు చేశారు. బస్టాండ్ నుంచి అంగడి బజార్ వరకు ర్యాలీగా వెళ్లారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎవ్వరికీ భయపడ కూడదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజవర్ధన్, రెండో ఎస్సై మృత్యుంజయ సర్కార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



బాదంపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

జన్నారం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇంటింటా తిరుగుతూ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. భవిష్యత్‌లో మోదీ చేసే సంక్షేమం గురించి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, బూత్ అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు కొట్టె చంద్రయ్య, లక్ష్మీరాజం , మహేశ్, కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

26వ వార్డులో శ్రమదానం



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న రియాజ్

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 26 వార్డులో సోమవారం కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి స్వరూప రియాజ్ శ్రమదానం చేశారు. వార్డు పరిధి అశోక్‌నగర్‌లో ఉన్న మురికి నీటి కాలువల్లో నిండిన పూడిక, పిచ్చి మొక్కలు కాల్వలో నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. స్వతహాగా సొంత డబ్బులతో ఓ కూలీని పెట్టి పూడిక తీత తీయించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వల కొరత కారణంగా ఈ నెల 8వ తేదీన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేయాలని బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి వి. మధుసూదన్ రెడ్డి కోరారు. 8వ తేదీన ఉదయం 11 గంటలకు రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చే వారికి, తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించేందుకు రక్తనిల్వలు తగ్గిపోయాయని, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తెరుచుకున్న క్యాతనపల్లి రైల్వే గేటు

రామకృష్ణాపూర్: ట్రాక్‌లైన్ మరమ్మతుల కారణంగా వారంరోజులుగా క్యాతనపల్లి రైల్వేగేటు మూసివేసి ఉన్న సంగతి తెల్సిందే. మరమ్మతులు పూర్తికావటంతో ఎట్టకేలకు సోమవారం సాయంత్రం 6గంటలకు గేటు ఓపెన్ చేశారు. దీంతో యథావిధిగా రాకపోకలు ప్రారంభమయ్యాయి.

న్యాయవాదికి పరామర్శ



పరామర్శిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలక్రైం: ఖానాపూర్‌కు చెందిన న్యాయవాది వెంకట మహేంద్రపై ఇటీవల జరిగిన దాడి విషయం తెలుసుకుని మంచిర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఖానాపూర్ వెళ్లి ఆయనను పరామర్శించారు. దాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నేతకానీ సంఘం నాయకులు

జైపూర్: మండల కేంద్రంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నేతకానీ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నేతకానీలకు సముచిత స్థానాన్ని కల్పిస్తూ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లింగయ్య, రమేశ్, మల్లేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జాల యువకుడికి సాహిత్యంలో ప్రశంస

జైపూర్: మండలం బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ సాహిత్యంలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో శ్రీశ్రీ కళావేదిక, కర్ణాటక సాహిత్య మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శతాధిక ద్విభాష కవి సమ్మేళనంలో పాల్గొన్న రవితేజ 'గట్టోడ మెట్టోడ గావురాల మల్లు' అనే కవితా శీర్షికతో తన కవిత్వాన్ని వినిపించారు. ఆయన అందించిన సాహిత్యానికి గుర్తింపుగా ప్రశంసాపత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించి సత్కరించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను చిత్తుగా ఓడించాలి

- కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్

బెల్లంపల్లి: ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధపడిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంపల్లి సింగరేణి సివిల్ విభాగంలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్‌ఎస్ పార్టీలు దొందూ దొందేనన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గెల్లి జయరాం, మాజీ కౌన్సిలర్లు పొట్ల సురేష్, భూపల్లి రాజేశ్వర్, కన్నయ్య సింగ్, అమానుల్లాఖాన్, అన్వర్ ఖాన్, కాసర్ల యాదగిరి, శ్రీనివాస్, రాజమల్లు, నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వంశీని గెలిపించాలని ప్రచారం

మంచిర్యాలటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ టీపీసీసీ సభ్యులు కొండ చంద్రశేఖర్ సోమవారం 21వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కొండ పద్మ, వార్డు కార్యకర్తలు, నాయకులతో ప్రచారం చేసి, చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాసిపేటలో...

కాసిపేట: వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడానికి సీపీఐ మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా సమితి సభ్యుడు సత్యం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాడి పోశం, గట్టు సర్వేశం, శంకర్, గట్టయ్య , రాజలింగు, పోశం పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు స్థానిక ఆదర్శనగర్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల కరపత్రాలను ఓటర్లుకు అందజేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు మైదం రవి, చెన్నూరి శ్రీధర్, రత్న సత్యనారాయణరెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

భీమారం: పేదల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు నిట్టూరి సందీప్ ప్రజలను కోరారు. మండలంలోని కొత్తపల్లిలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు లింగాల మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి



ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ

జన్నారం: మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు పలు దుఖాణాలలో సోమవారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం మేనిఫెస్టో వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫసీఉల్లా, నాయకులు రియాసత్ అలీ, సాధుపాషా, మోసిన్‌ఖాన్, గోపి, మహిమూద్, లాకవత్ తిరుపతి, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

దండేపల్లి: బీఆర్‌ఎస్ దండేపల్లి గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెన మహేష్, అధ్యక్షుడిగా అల్లంల సంతోష్ ఎన్నికయ్యారు.